ములాఖాత్

# జిందగీ

colors of telangana

కొంకణ్ రైలు కంకణం కట్టుకుంటే..
గోవాలో గొడవ చేశారు..
ఎంఎంటీఎస్ భుజానికెత్తుకుంటే...
ఈగల బండి ఇక్కడెందుకు అన్నారు..
మెట్రో రైలు నెత్తినేసుకుంటే..
'పీపీపీ' మీద ఫీలయ్యారు..
అయినా ఆయన అధైర్యపడలేదు..
సహనం ఆయన వ్యసనం..
కమిటయితే కష్టపడడం..
చేసే పనిని ఇష్టపడడం ఆయన నైజం.
అందుకే 'మెట్రో'కి ఎన్ని అవరోధాలు
ఎదురైనా ఇప్పుడు పట్టాలెక్కిస్తున్నాడు.
ఆయనే హైదరాబాద్ మెట్రో రైలుకి పర్యాయపదంగా
మారిన నల్లమల్లి వెంకట సత్యనారాయణ రెడ్డి.
ఎన్వీఎస్ రెడ్డిగా పాపులర్ అయిన
పాలమూరు అల్లుడితో ములాఖాత్ ఇది.




# మెట్రో మ్యాన్ ఎన్వీఎస్

కరోలి తకాక్స్...
హంగేరి సైనికదళంలో ఒక రైఫిల్ షూటర్..
ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలన్నది అతని లక్ష్యం..
1938లో ఒకరోజు..
గ్రెనైడ్ పేలడంతో తకాక్స్ కుడిచేయి కోల్పోయాడు.
ఆ తర్వాత అతడు ఎవరికీ కనిపించలేదు.

ఆత్మహత్య చేసుకున్నాడని కొందరనుకున్నారు. పిచ్చిపట్టిందని ఇంకొందరన్నారు.

ఆఫ్టర్ వన్ ఇయర్.. హంగేరీ నేషనల్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌కి అతడొచ్చాడు.

'పోటీలు చూడటానికి వచ్చావా?' అని అడిగారు చాలామంది.

'పోటీలో పాల్గొనడానికి వచ్చా'నన్నాడు తకాక్స్.

పాల్గొనడమే కాదు, బంగారు పతకాన్నీ సాధించాడు.

ఇంతకీ.. ఏడాదిపాటు అతడేం చేశాడో తెలుసా? ఎడమ చేత్తో షూటింగ్ సాధన చేశాడు. దటీజ్ తకాక్స్.

కానీ అతని లక్ష్యం 1940 ఒలింపిక్స్. రెండో ప్రపంచ యుద్ధ కారణంగా అవి జరగలేదు.. 1944లోనూ అంతే..

ఎట్ లాస్ట్.. 1948లో తకాక్స్ ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. హంగేరీ హీరో అయ్యాడు.

ప్రతికూల పరిస్థితుల్లో కుంగిపోకుండా ధైర్యంగా పోరాడితే విజయం దక్కుతుంది.

ఈ కథ చెప్పింది ఎన్వీఎస్‌రెడ్డి. దీన్ని ఆయన ఆచరించడమే కాదు.. తన టీమ్ డీలాపడినప్పుడు ఈ కథ చెప్పి వారికి స్ఫూర్తినిచ్చాడు.

సత్యం కుంభకోణం.. రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపింది. రామలింగ రాజులాంటి కార్పొరేట్ మేధావి కటకటాలను కౌంట్ చేశాడు.

అప్పుడు సత్యం గ్రూపుకి చెందిన మెటాస్ కంపెనీ చేపట్టిన మెట్రో రైలు ప్రాజెక్టు పరిస్థితి పెద్ద క్వశ్చన్ మార్క్ అయింది.

## రెబల్

ఎన్వీఎస్ రెడ్డి పుట్టింది తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కుతుకలూరులో. నలుగురు పిల్లల్లో పెద్దవాడు. తాతయ్య వ్యవసాయం చేసేవాడు. ఆయన పనులు నిర్వహించే తీరు చూసి చిన్నప్పటి నుంచే ఎన్వీఎస్ మేనేజ్‌మెంట్ పాఠాలు నేర్చుకున్నాడు. చదువులో ఫస్ట్.. పుస్తకాల పురుగు. క్లాసు పుస్తకాలతో పాటు నవలలూ చదివేవాడు. ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన 'మాలపిల్ల' ఎనిమిదో తరగతిలోనే చదివేశాడు. చలం, రంగనాయకమ్మ, దేవరకొండ బాలగంగాధర్ తిలక్, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ.. ఇలా ఎంతో మంది రచనలు చదివాడు. అందరికన్నా శ్రీశ్రీ సాహిత్యాన్ని ఎక్కువగా ఇష్టపడేవాడు. విప్లవ సాహిత్యం అంటే ఒళ్లు ఊగిపోయేది. అదే ఆయన్ని రెబల్‌గా తయారు చేసింది.

## సైన్స్ 2 ఆర్ట్స్

ఎన్వీఎస్ డాక్టర్ అవ్వాలనేది అమ్మానాన్నల కోరిక. ఆయనకు మాత్రం ప్రజాసేవ చేయాలని ఉండేది. అలా చేయాలంటే సివిల్ సర్వీసెస్‌కు వెళ్లాలని ఇంటర్‌లో తెలిసింది. చాలామంది కలెక్టర్లు, ఐపీఎస్ ఆఫీసర్లు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాయలం నుంచే వచ్చారనీ వాళ్లల్లో ఎక్కువ మంది ఎమ్మే చరిత్ర, రాజకీయ శాస్త్రం వంటివి తీసుకుని విజయం సాధించారనీ అప్పట్లో అందరూ అనుకునేవారు. వాళ్లలాగే తానూ చదువుకోవాలని సైన్సు గ్రూపు వదిలేసి ఇంటర్‌లో ఆర్ట్స్‌లో చేరాడు. ఈ విషయం తెలిసి ఇంట్లో వాళ్లు బాగా తిట్టారు. రెబల్ కదా పెద్దగా పట్టించుకోలేదు. సివిల్స్‌లో విజయం సాధించాలంటే ఆంగ్లంపై పట్టు సాధించాలి. అందుకు బీబీసీ రేడియో దారి చూపించింది. రోజూ సాయంత్రం నుంచి పడుకునే దాకా రేడియో వినేవాడు. కష్టపడి చదివి ఆంధ్రా విశ్వవిద్యాలయం టాపర్ అయ్యాడు. తల్లిదండ్రులకు అతనిపై నమ్మకం కుదిరింది.

## ఫైనాన్స్ మాస్టర్...

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎమ్మే (రాజనీతిశాస్త్రం)లో చేరాడు. బీఏలో యూనివర్సిటీ టాపర్ కావడంతో మొదట్లో కొంత ప్రౌడ్ ఉండేది. కానీ అక్కడ అతనికంటే తెలివైన విద్యార్థుల్ని చూశాక అదంతా దిగిపోయింది. పీజీ పూర్తయి పీహెచ్‌డీ చేస్తుండగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశాలొచ్చాయి. అందులో చేరితే సివిల్స్ రాక చేరాడనుకుంటారని చేరలేదు. 1982లో మొదటిసారి సివిల్స్ రాశాడు. రాలేదు. రెండోసారి రాసి ఐఆర్ఏఎస్ (ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్)కి ఎంపికయ్యాడు. శిక్షణ పూర్తయ్యాక సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగం వచ్చింది. అర్థశాస్త్రం చదవడం వల్ల రైల్వే ఫైనాన్స్‌లో మాస్టర్ అయ్యాడు. విధుల్లో చేరిన నాలుగేళ్లకే బరోడా రైల్వే స్టాఫ్ కళాశాలలో పాఠాలు చెప్పే ప్రావీణ్యం సంపాదించాడు. సీనియర్లకు కూడా పాఠాలు చెప్పే స్థాయి అతనిది.

## 'కొంకణ్' విత్ శ్రీధరన్

ఎన్వీఎస్ రెడ్డి గుంతకల్‌లో సీనియర్ డిప్యూటీ ఫైనాన్షియల్ అడ్వైజ



భార్య ప్రతిమ, పిల్లలు అర్జున్, రాహుల్‌తో ఎన్వీఎస్‌రెడ్డి

రావాల' అని ఆయన్ని దక్షిణ మధ్య రైల్వేకు బదిలీ చేశారు. సికింద్రాబాద్ తర్వాత అటు కర్నూలు వెళ్లాలన్నా.. ఇటు నిజామాబాద్ పోవాలన్నా మీటర్ గేజ్ మాత్రమే ఉండేది. బ్రాడ్ గేజీగా మారిస్తే రైల్వేలకూ, తెలంగాణ ప్రాంతానికి ప్రయోజనం కలుగుతుంది. దీంతో ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేసి పనులు మొదలుపెట్టారు. సికింద్రాబాద్-మహబూబ్‌నగర్, ద్రోణాచలం-గుంతకల్లు, సికింద్రాబాద్-నిజామాబాద్-పర్భని, ముత్‌ఖేడ్-ఆదిలాబాద్, తిరుపతి-పాకాల-కాట్పాడి, నంద్యాల-గిద్దలూరు-గుంటూరు ఇలా ఎన్నో మీటర్ గేజ్ మార్గాలను బ్రాడ్ గేజీలుగా మార్చారు. పనులు పూర్తయ్యాక మహబూబ్‌నగర్‌లో ఒక సభ ఏర్పాటు చేశారు. అందులో స్వాతంత్ర్య సమరయోధుడు పాగా పుల్లారెడ్డి 'పాలమూరు అల్లుడు పాలమూరికి మల్గాడి తెచ్చిండు' అని అనడంతో సభ చప్పట్లతో మార్మోగింది. మీటర్ గేజీలను బ్రాడ్ గేజీలుగా మార్చినందుకు ఎన్వీస్ రెడ్డికి 'పీవీ నర్సింహారావు గ్రూపు' అవార్డు దక్కింది. 2002లో రైల్వే మినిస్టర్ అవార్డుకు కూడా ఆయన ఎంపికయ్యారు.

## ఎన్‌పీడీ.. ఎంఎంటీఎస్..

చాలాకాలం రైల్వేలో పనిచేసిన ఎన్వీఎస్‌కి కొంత అసంతృప్తి ఉండేది. సరిగ్గా అదే సమయంలో మన రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టారు. అందుకోసం డైరెక్టర్ (ఫైనాన్స్) పదవికి ఎంపిక చేపట్టారు. ఎంతో మంది చార్టర్డ్ అకౌంటెంట్లు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఎన్వీఎస్ రెడ్డి ఆ పదవిని దక్కించుకున్నారు. 2002 జూన్‌లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లో ఆయన చేరారు. అప్పటికది రోజుకు కోటిన్నర రూపాయల నష్టంతో నడుస్తోంది. సీఎండీ గోపాల్‌రెడ్డి సాంకేతిక విషయాలు, ఎన్వీఎస్ రెడ్డి నిర్వహణ బాధ్యతలు చూసుకునేవారు. నిర్వహణ లోపాలు సరిదిద్ది ఏడాది తిరిగేసరికి సంస్థను లాభాల బాట పట్టించారు. ఆ తర్వాత ఎంఎంటీఎస్ ప్రాజెక్టు బాధ్యతలు చేపట్టారు. 'ఎంఎంటీఎస్ ఈగలు.. దోమల కోసమే. మనుషులెవరూ ఎక్కరు' అని చాలామంది కామెంట్ చేశారు. పదివేల మంది కోసం ఇంత పెద్ద ప్రాజెక్టు అవసరమా అన్నారు. కానీ ఈరోజు అవే రైళ్లు లక్షన్నర మందిని గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. 'ఇక్కడ అందరూ గుర్తించాల్సిన విషయం ఏంటంటే ప్రభుత్వం ఆరంభించే ఏ ప్రాజెక్టు అయినా మొదటి రోజు నుంచే విజయవంతమవుతుందని అనుకోవద్ద'ంటారు ఎన్వీఎస్ రెడ్డి. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎన్వీఎస్ రెడ్డి నాలుగు ఫ్లై ఓవర్లను నిర్మించారు. ట్రాఫిక్ ఇంజనీరు భావనారాయణతో కలిసి 2004లో ఈ ప్రాజెక్టు చేపట్టారు. నల్గొండ క్రాస్‌రోడ్స్, చాంద్రాయణ గుట్ట, పంజాగుట్ట, గ్రీన్‌ల్యాండ్స్ ఫ్లై ఓవర్లే ఆ నాలుగు.



## ఇంధనం ఖర్చు తక్కువ.. ఇంజన్ స్పీడెక్కువ

- ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో నిర్మిస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టు ప్రపంచంలోనే మొదటిది, అతి పెద్దదిగా గుర్తింపుపొందింది.
- మొత్తం ప్రాజెక్టు వ్యయం 14 వేల 132 కోట్ల రూపాయలు.
- మొదటి దశలో భాగంగా అత్యంత రద్దీగల ప్రదేశాల గుండా 71.16 కిలోమీటర్ల పొడవున 3 రూట్లలో రైలు మార్గం నిర్మిస్తున్నారు.
- సరాసరిన ప్రతి కిలోమీటరుకు ఒక రైల్వే స్టేషన్ ఉంటుంది.